క్లుప్తంగా

ఓటరు చైతన్యంపై కళాప్రదర్శనలు



కాకరవాయిలో ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

తిరుమలాయపాలెం: ప్రతీ ఓటరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ ఓటర్లను చైతన్య పరిచేందుకు మండలంలోని కాకరవాయి, సుబ్లేడు, తిరుమలాయపాలెం గ్రామాల్లో మంగళవారం కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఈమేరకు ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించాలని, ధన, మద్యం ప్రలోభాలపై సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కళాప్రదర్శనల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతీ ఓటరు ఓటు అనే ఆయుధం ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని తెలిపారు. కొమ్ము రమేశ్ కళా బృందం సభ్యుల ఆధ్వర్యాన నిర్వహించిన కళా ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు అభినందన

ఖమ్మం సహకారనగర్: పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా తమ కళాశాలకు చెందిన విద్యార్థులు 12మంది కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్జేసీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఉద్యోగాలకు ఎంపికైన వారిని అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.లింగయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల కేంద్రానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

ఖమ్మం సహకారనగర్ / నేలకొండపల్లి: జాతీయ సమైఖ్యత దినోత్సవంలో భాగంగా ఉషోదయ డే రెసిడెన్షియల్ కేంద్రానికి నేలకొండపల్లి పదో తరగతి(1990–91వ బ్యాచ్) పూర్వ విద్యార్థులు నగరంలోని మానసిక దివ్యాంగుల కేంద్రంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు జి.సత్యనారాయణ, వి.శ్రీనివాసరావు, మీరా, చల్లగుళ్ల రమేశ్ తదితరులు మాట్లాడుతూ.. ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించిన సమయాన సేకరించిన రూ.10వేలతో మానసిక వికలాంగులకు అన్నదానం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రానందున్న ప్రతి ఒక్కరూ తమ వంతుగా సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు కృష్ణవేణి, పూర్వ విద్యార్థులు తెల్లగొర్ల లింగస్వామి, ఉసిరికాయల శ్రీను, రమేశ్, సత్యనారాయణ రెడ్డి, మీరా తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా 'నానబాల'



నానబాల రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: ఏఐవైఎఫ్ (అఖిల భారత యువజన సమైక్య) జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ నెల 29, 30, తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. తన నియామకం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ.. రాష్ట్ర మహాసభల ప్రోత్సాహంతో జిల్లాలో మరిన్ని పోరాటాలు నిర్మించి ఉద్యమాలకు శ్రీకారం చుట్టి ఏఐవైఎఫ్‌ను బలీయమైన శక్తిగా నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఎన్‌టీఆర్ పార్క్‌లో సంబరాలు

ఖమ్మం మయూరిసెంటర్: ఏపీ మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడుకు బెయిల్ మంజూరు కావడంతో ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్ వద్ద పార్క్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడుకు తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు అత్యంత ఆప్తుడని, ఇన్నాళ్లు ఆయన విడుదల కోసం ఎదురు చూశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ డైరెక్టర్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, కొత్తపల్లి నీరజ, మందడపు లక్ష్మితో పాటు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సకుటుంబ సపరివారంగా..!



ప్రచారం నిర్వహిస్తున్న పొంగులేటి సతీమణి మాధురి(ఫైల్)



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందాళ కుటుంబసభ్యులు(ఫైల్)



ప్రచారంలో పాల్గొన్న పువ్వాడ సతీమణి వసంతలక్ష్మి(ఫైల్)

ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో ఊపందుకున్న ప్రచారాలు

- ప్రచారాల్లో అభ్యర్థుల కుటుంబసభ్యులు
- దసరా నుంచి పొంగులేటి ప్రచారం
- సెంటిమెంట్‌తో మునిగేపల్లి నుంచి కందాళ ప్రచారం
- ఖమ్మంలో పువ్వాడ, తుమ్మల ప్రచార హోరు

జంగ్ తెలంగాణ

కూసుమంచి: పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచారాలు ఊపందుకున్నాయి. దీంతో ఆయా పార్టీల నాయకుల రాకతో పట్టణాల్లోని డివిజన్లు, గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. పాలేరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కందాళ ఉపేందర్‌రెడ్డిని నెల క్రితమే ప్రకటించగా ఆయన తరఫున ప్రతి రోజూ ఏదో ఒక గ్రామంలో ప్రచారం కొనసాగుతూనే ఉంది. ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డిని అధిష్టానం అధికారికంగా ప్రకటించగా.. ఆయన సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం పేరుతో ఇప్పటికే నియోజకవర్గాన్ని చుట్టి వస్తున్నారు. ఇక బీఎస్పీ అభ్యర్థిగా అల్లిక వెంకటేశ్వరరావు అభ్యర్థిత్వాన్ని కూడా నెల రోజుల క్రితమే ప్రకటించగా ఆయన ఏకంగా ప్రచార రథంతోనే నియోజకవర్గంలో పర్యటిస్తూ తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇక వైఎస్సార్‌టీపీ, బీజేపీ తదితర పార్టీల అభ్యర్థులు ఖరారు కావాల్సి ఉన్నందున వారు కూడా త్వరలో బరిలో దిగనున్నారు. అలాగే ఖమ్మం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పువ్వాడ అజయ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు ఖరారు కాగా నియోజకవర్గంలో ప్రచారం జోరుగా సాగుతుంది.

దసరా నుంచి పొంగులేటి..

ఇక పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధిష్టానం టికెట్ ప్రకటించకముందే దసరా పర్వదినం రోజున మంచి రోజుగా భావించి కూసుమంచి మండలంలోని పాలేరు, నాయకన్‌గూడెం, కూసుమంచి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. శుక్రవారం ఆయనకు టికెట్ అధికారికంగా ప్రకటించడంతో ఆయన నియోజకవర్గంలోని ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో ఎన్నికల ప్రచారాలను చేపట్టారు.

మునిగేపల్లి నుంచి కందాళ..

ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి కూసుమంచి మండలం మునిగేపల్లి నుంచి ఎన్నికల ప్రచార బరిలో దిగారు. గతంలో కూడా ఆయన ఇక్కడి నుంచి ప్రచారం చేపట్టి విజయం సాధించగా.. సెంటిమెంట్‌గా తిరిగి ఈసారి కూడా మునిగేపల్లినే ఎంచుకున్నారు.

ఖమ్మం అభ్యర్థుల ప్రచార హోరు..

ఖమ్మం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ప్రకటించినప్పటి నుంచి అన్ని డివిజన్లలో తిరుగుతూ తనతో పాటు తన కుటుంబసభ్యులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు డివిజన్లలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి తన కుటుంబసభ్యుల ప్రమేయం లేకుండా పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్నారు.

ప్రచారాల్లో కుటుంబసభ్యులు...

ఇక పాలేరులో ప్రధాన అభ్యర్థులు అయిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కందాళ ఉపేందర్‌రెడ్డి తరఫున వారివారి కుటుంబ సభ్యులు ప్రచారాలు కొనసాగిస్తున్నారు. దీంతో వారు మండలాల వారీగా గ్రామాల్లో తిరుగుతూ ఓట్లు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరఫున ఆయన సోదరుడు ప్రసాదరెడ్డి, కుమారుడు హర్షరెడ్డి, సతీమణి మాధురితో పాటు ప్రసాదరెడ్డి సతీమణి శ్రీలక్ష్మి తదితరులు ప్రచారాల్లో పాల్గొంటున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి విజయలక్ష్మి, కుమార్తెలు దీపిక, దీప్తితో పాటు పలువురు బంధువులు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అలాగే ఖమ్మం నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పువ్వాడ అజయ్‌కుమార్ ప్రకటన నుంచి ఆయన గెలుపును కాంక్షిస్తూ పువ్వాడ ఓ పక్క ప్రచారం చేస్తుండగా మరో పక్క ఆయన కుటుంబసభ్యులు అయినా ఆయన సతీమణి వసంతలక్ష్మి, కుమారుడు నయన్‌రాజ్‌లు విస్తృంగా ప్రచారం చేస్తున్నారు. వివిధ వర్గాల ప్రజలతో వారు మమేకం అవుతూ ప్రచారాలు చేపడుతున్నారు.

ఉద్యమకారుల సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



నినాదాలు చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: నవంబర్ ఒకటిన ఉదయం 11 గంటలకు ఖమ్మం ఒయాసిస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని డాక్టర్ కే.వీ.కృష్ణారావు కోరారు. మంగళవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరావు, మధిర అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క పాల్గొంటాని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ గోపగాని శంకర్‌రావు, గుంతేటి వీరభద్రం, అర్వపల్లి విద్యాసాగర్, రాంబాబు నాయక్, శ్రీనివాసరెడ్డి, షేక్.మస్తాన్, తురాబ్, రామారావు, బచ్చల పద్మాచారి, శ్రీనివాస్, కామా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టుకు బీజేపీ కుట్ర

ఖమ్మంరాపర్తినగర్: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా ఆమ్ ఆద్మీ పార్టీ వ్యవస్థాపకుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని ఆమ్‌ఆద్మీ పార్టీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్, తెలంగాణ కోర్ కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమలరావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉండి దేశవ్యాప్తంగా విస్తరిస్తుందనే భయంతోనే లేని లిక్కర్ కుంభకోణం సృష్టించిన బీజేపీ విచారణ పేరుతో ఎన్నికల సమయాన ఈడీ నోటీసుల వ్యవహారం తెరపైకి తీసుకొచ్చిందని విమర్శించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ సామాన్యుల పార్టీ కనుక ప్రతి ఆప్ కార్యకర్త ఒక కేజ్రీవాల్‌గా మారి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం..

మాజీ మంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల



రఘునాథపాలెం: వీవీపాలెం ప్రచారంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పక్కాగా అమలు చేస్తామని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నిర్వహించిన ప్రచారం, పలు ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందులో భాగంగా గ్రెయిన్ మార్కెట్‌లో రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే నగరంలోని గాంధీచౌక్‌లో కొప్పు అభిరామ్ అపార్ట్‌మెంట్, 36వ డివిజన్ సుందర్ టాకీస్ రోడ్డులో, ఎస్ఆర్ కన్వెన్షన్‌లో నగర రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, బల్లేపల్లి బ్లూమింగ్ మైండ్స్ స్కూల్ అండ్ కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో, 52వ డివిజన్ సరితా క్లినిక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పలు ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన మాట్లాడారు. అదేవిధంగా రఘునాథపాలెం మండలం వీవీపాలెంలో, 6వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. నిధులు, నియామకాల బేస్ మీద ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అలంభిస్తున్న విద్యావ్యతిరేక విధానాలతో పేపర్ల లీకులు, నిరుద్యోగుల ఆత్మ స్థైర్యం దెబ్బతిని ఆత్మహత్యల పాలవుతున్నారని చెప్పారు. వ్యవసాయం గురించి సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తినే మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించానని, నేడు అలా లేదన్నారు. ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించడంతో మార్కెట్ ప్రగతిబాటలో నడుస్తుందన్నారు. నేను మంత్రిగా ఉన్నప్పుడే ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసమే నూతన బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టానని, కొందరు స్వలాభం కోసం దానిని రేకులషెడ్డులా మార్చి నాసిరకంగా కట్టారన్నారు. భూకబ్జాలు, అక్రమ కేసులతో ఖమ్మంలో అరాచకపాలన నడుస్తుందని, దానిని మార్చేందుకే నేను ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా ముందుకువచ్చానన్నారు. తాగు.. సాగు నీరు లేని వెంకటాయపాలెం గ్రామాన్ని అభివృద్ధి బాట పట్టించానన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడైనా తన వ్యక్తిగత స్వార్థం కోసం పనిచేయలేదని, అభివృద్ధి కోసమే తపించానని తుమ్మల పేర్కొన్నారు. నెల రోజులు తన కోసం కష్టించి పనిచేస్తే తరువాత మీకు ప్రశాంతమైన, ఆనందకరమైనటువంటి పాలనను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ కమర్తపు మురళీ, మహ్మద్ జావీద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఎంపీపీ భూక్యా గౌరి, ఎంపీటీసీ యరగర్ల హనుమంతు రావు, సాధు రమేష్‌రెడ్డి, కొప్పెర ఉపేందర్, ముస్తఫా, కొంగర జ్యోతిర్మయి, జంగం భాస్కర్, యడ్లపల్లి సంతోష్, బ్లూమింగ్ మైండ్స్ కాలేజీ కరస్పాండెంట్ అశోక్ రెడ్డి, వీరారెడ్డి, మైనారిటీ నాయకుడు చోటా బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తికి చెందిన వెంకటరమణగారు,.వెంకన్న, మాలోత్ వీరు నాయక్, సీతారాములు, బసవయ్య తదితరులు మాజీ సర్పంచ్ తమ్మిన్ని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతేకాక తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, ఉస్మానియా జేఏసీ నాయకుడు, బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న రడం సురేష్ మంగళవారం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు.

'తుమ్మల' వ్యాఖ్యలు గర్హనీయం



మాట్లాడుతున్న దోరేపల్లి శ్వేత

ఖమ్మంమయూరిసెంటర్: మార్కెట్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఓట్లు అభ్యర్థించి వెళ్లకుండా ఆయన వయస్సు, రాజకీయ అనుభవాన్ని మరచి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి గురించి మాట్లాడడం సరికాదని ఏఎంసీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు చైర్మన్ పదవి ఇచ్చామని, ఇప్పుడు అలా ఇవ్వలేదని తుమ్మల మాట్లాడిన తీరు వ్యంగ్యంగా ఉందని, మంచిగా ఇచ్చే ఉంటే బాగుండేది అని అనడంలో అర్థం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. తాను రైతు బిడ్డనేనని, మా తాత, మా పూర్వీకులు ఇక్కడే బుర్హాన్‌పురంలో వ్యవసాయం చేసేవారని, తాను ఇప్పటికీ అక్కడ పండినదే తింటున్నానని పేర్కొన్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతో కమీషన్ వ్యాపారులకు లైసెన్సులు, మార్కెట్ అభివృద్ధి జరుగుతుందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు మాట్లాడుతూ.. శంకుస్థాపనలు చేసి, శిలాఫలకాలు వేస్తే అభివృద్ధి చేసినట్లు కాదని అన్నారు. పనులు పూర్తి చేస్తేనే అభివృద్ధి అని, మార్కెట్‌లో లైసెన్సుల కోసం ఏ వ్యాపారి డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. ఈ సమావేశంలో వ్యాపారులు మెంతుల శ్రీశైలం, మన్నెం కృష్ణ, మాటేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్

ఉక్కు మనిషి, దేశ మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, యువతీయువకులు వల్లభాయ్ పటేల్ అడుగుజాడల్లో నడవాలంటూ ప్రతిజ్ఞ చేయించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– సాక్షినెట్‌వర్క్



తిరుమలాయపాలెం: పిండిప్రోలు కళాశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు

పువ్వాడ గెలుపే లక్ష్యంగా ప్రచారం..



ఖమ్మంఅర్బన్: చర్చిలో అజయ్, తదితరుల ప్రార్థనలు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: బీఆర్‌ఎస్ పార్టీ ఖమ్మం నియోజక వర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈమేరకు నగరంలోని 32వ డివిజన్ కార్పొరేటర్ దోన్వాన్ సరస్వతి, పార్టీ 27వ డివిజన్ ఇన్‌చార్జ్ పాలడుగు పాపారావు, 29వ డివిజన్ అధ్యక్షుడు యర్రా అప్పారావుల ఆధ్వర్యాన నిర్వహించిన ప్రచారంలో ఆ పార్టీ అసెంబ్లీ ఎన్నికల జిల్లా సమన్వయ కర్త గుండాల కృష్ణ పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. అలాగే రఘునాథపాలెం మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అజ్మీరా వీరునాయక్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మద్దినేని నరసింహారావు ఆధ్వర్యాన మండలాల్లోని పలు తండాల్లో విస్తృత ప్రచారం సాగించారు. ఈనేపథ్యాన నగరంలోని 9వ డివిజన్ రోటరీనగర్‌లోని గుడ్ షెపర్డ్ చర్చ్‌లో పాస్టర్ సత్యపాల్ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు నన్నే పఠాన్, సూరేపల్లి ఉపేందర్, తిరుపతయ్య, మస్తాన్, నాయకులు కూచిపూడి కిషోర్, నామవరపు ఈశ్వర్, నామవరపు సతీష్, దుంగ్రోత్ నాగన్న,దొన్వాన్ శ్రీను,మంగా రావు, పల్లి ఉపేందర్, కనపర్తి బాబుతో పాటు జాన్ కాంతారావు, ప్రవీణ్ కుమార్, క్రిష్టఫర్, ఆనంద్ బాబు, సజ్జన్ పాల్, బి.ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యం కష్ట, సుఖాల్లో పాలుపంచుకున్నా..

ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



కొక్కిరేణిలో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం/కూసుమంచి: నిత్యం ప్రజల కష్ట,సుఖాల్లో పాలుపంచుకుని వారి కష్టాలు తీర్చేందుకు అహర్నిశలు కృషి చేసిన తనను ప్రజలు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. కష్టమొచ్చిన వారికి రాజకీయాలకు అతీతంగా ఆర్థిక సాయం ఆదుకున్నానని, తనకు అన్ని పార్టీలను ఓటు అడిగే హక్కు ఉందన్నారు. పరాయి ప్రాంతం వారు మనకు అవసరమా?, పాలేరు బిడ్డనైనా తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అలాగే కూసుమంచి మండలంలోని నర్సింహులగూడెంలో కందాళ ఉపేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన కుమార్తె దీపిక ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మంగీలాల్, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, వీరన్న, గడుపుడి రాజా, జోగుపర్తి వెంకటేశ్వర్లు, దామోదర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించిన సర్కార్‌ను సాగనంపుదాం..



ప్రసాద్‌రెడ్డిని ఎత్తుకుని అభిమానాన్ని చాటుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఖమ్మంరూరల్/కూసుమంచి: ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా అరిగోస పెడుతున్న నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలంలోని మద్దివారిగూడెం, పోలిశెట్టిగూడెం, ధాక్యాతండాల్లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు. ఈమేరకు దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు సాయిగణేష్‌నగర్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా కూసుమంచి మండలంలోని బోడియా తండాకు చెందిన పలువురు ప్రసాదరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు బదావత్ చిన్ని హరియా, బోడ మురళి, అచ్చమ్మ, భూక్యా వెంకన్న, బోడ వీరు, బదావత్ సునీల్, భూక్యా నామా, బాలాజీ, హుస్సేన్, వెంకన్న, బానియా తదితరులు ఉన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి

స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను మండలాల్లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత దేశానికి ఆమె అందించిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంవన్‌టౌన్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్/కామేపల్లి: ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల జిల్లా సమన్వయ కర్త గుండాల కృష్ణ కోరారు. ప్రజా ఆశీర్వాద సభ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం త్రీ టౌన్ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగా త్రీ టౌన్ ప్రాంతం నుంచి సభకు 20 వేల మందిని సమీకరించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మెంతుల శ్రీశైలం, తోట రామారావు, పసుమర్తి రాం మోహన్, మాటేటి నాగేశ్వరరావు, కన్నం ప్రసన్న కృష్ణ,పాలడుగు పాపారావు, దనాల శ్రీకాంత్, రుద్రగాని ఉపేందర్, తోట వీరభద్రం, గజ్జెల వెంకన్న, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. నేడు(బుధవారం) ఇల్లెందులో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు మండలం నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బీసీల ఐక్యతకు సహకరించాలి



ఐక్యత చాటుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీల ఐక్యతకు సహకరించాలని బీసీ జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు పాల్వంచ రామారావు తెలిపారు. మంగళవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల నాయకులు బీసీలు, ముస్లింలు, మున్నూరు కాపులను ఎంతో కాలంగా ఎలాంటి రాజకీయ పదవులు ఇవ్వకుండా అన్ని విధాలుగా దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. రాజకీయాలలో మార్పు కోసం ప్రశ్నించే గొంతుక, ఉద్యమ నాయకుడు, అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన అభ్యర్థి రామారావు గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిట్టోజు రమేష్, టీవీ రాజు, డాక్టర్ బీ.వీ.రాఘవులు, శ్రీనివాస్, సాయిరాం, రోశయ్య, నాగులు, జయరాజ్, సైదయ్య, అంజన్‌రాజు, గరిడేపల్లి సత్యనారాయణ, డాక్టర్ హైమావతి, రేష్మా, చందన తదితరులు పాల్గొన్నారు.